



గజ వాహనంపై ఆది దంపతులు

అర్జీలు ఆన్‌లైన్‌లో సమర్పించొచ్చు

నేడు అర్జీల స్వీకరణ : కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చునని కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా అర్జీలను స్వీకరిస్తామన్నారు. అర్జీ పరిష్కారస్థితి గురించి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. జిల్లా కేంద్రంలో అధికారులు ఉదయం 9 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.


దేవరగట్టుకు చేరుకున్న పల్లకి



నేరణికిలో డప్పు వాయిద్యాల మధ్య దేవరగట్టుకు వెళ్తున్న పల్లకి

హొళగుంద, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్నీ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామివారి పల్లకి దేవరగట్టుకు చేరుకుంది. ఆలయ పూజారులు గిరి మల్లయ్య, మహేష్, మనోహర్ ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేరణికి గ్రామం మల్లేశ్వర స్వామి దేవాలయం లోని మాళమ్మా, మల్లేశ్వర స్వామి పల్లకికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లో పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి దేవరగట్టుపై ఉన్న గిరికి పల్లకి చేరుకోగానే కర్రల సమరానికి గ్రామాల ప్రజలు సిద్ధమవుతారు. అక్టోబరు 2వ తేదీన దసరా పండుగ రోజు కీలకమైన బన్నీ ఉత్సవం ఉంటుందని ఆలయ పూజారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కురువ సోము, బోయ మల్లికార్జున, వీరనగప్ప, గోపాల్, కంచ వీర మహేష్ కుమార్, గోరవయ్యలు మెలిగిరి, గిరి, వెంకటేష్, చంద్ర పాల్గొన్నారు.

ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ



అగసనూరు సమీపంలో ఆర్డీఎస్ ఆనకట్టకు పోటెత్తిన వరద

కోసిగి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట జలకళను సంతరించుకుంది. పశ్చిమ ప్రాంతంతో పాటు ఎగువన ఉన్న కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు సుమారు 1.20 లక్షల క్యూసెక్కుల నీరు ఆర్డీఎస్‌కు పోటెత్తింది. తుంగభద్ర నదితీర గ్రామాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. చేపలవేటకు వెళ్లవద్దని సూచించారు. ఆనకట్ట వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు.

కాళరాత్రి అలంకరణలో భ్రామరి

● శ్రీగిరిపై ఆది దంపతులకు గజ వాహనసేవ



కాళరాత్రి అలంకరణలో దర్శనమిస్తున్న భ్రమరాంబికా దేవి



శ్రీశైలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలు నందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఆదివారం భ్రమరాంబికా దేవి భక్తులకు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారిని అక్కమహాదేవి అలంకార మండపంలో విశేష పుష్పాలతో అలంకరణ చేశారు. ఈదేవి నల్లటి దేహఛాయతో జుట్టు విరబోసుకుని రౌద్రరూపంలో కనిపించారు. ఈ అలంకరణలో అమ్మవారు నాలుగు చేతులను కలిగి ఉంటారు. కుడివైపున అభయ హస్తం, వరద ముద్రను, ఎడమవైపు ఖడ్గము, లోహకంటకాన్ని ధరించారు. కాళరాత్రి స్వరూపం చూడటానికి రౌద్రంగా ఉన్నప్పటికీ ఈమె ఎల్లప్పుడూ శుభ ఫలితాలను ఇస్తారు. అందుకే ఈమెను శుభంకరి అని కూడా పిలుస్తారు.

గజవాహనంపై ఆది దంపతులు : వాహనసేవలో భాగంగా సాయంత్రం భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామి వారు ప్రత్యేక అలంకరణలో గజవాహనంపై విహరించారు. అక్కమహాదేవి అలంకార మండపం నుంచి ఆలయ రాజగోపురం మీదుగా గంగాధర మండపం, నందిగుడి క్షేత్ర ప్రాంతాల్లో గ్రామోత్సవం కొనసాగింది. ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. గ్రామోత్సవం ఎదుట సాంస్కృతిక కళారూపాలు, వివిధ వేషధారణలు, సంగీత వాయిద్యాలతో కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. నిత్య కళారాధన వేదికలో విజయవాడకు చెందిన గాయత్రీ నృత్యానికేతన్ బృందం సంప్రదాయ నృత్యం ప్రదర్శించగా, వి.కృష్ణకుమార్ బృందం సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది.

నేడు మహాగౌరి అలంకరణ

దసరా ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు సోమవారం అమ్మవారు మహాగౌరి అలంకరణలో దర్శనమిస్తారు. రాత్రికి ఆది దంపతులు నందివాహనంపై విహరిస్తారు.





వివిధ వేషధారణలో కళాకారులు



గ్రామోత్సవం ఎదుట కళాకారుల ప్రదర్శనలు



యువతుల కోలాటం

రోడ్ల నిర్మాణం వేగవంతం

● నాబార్డు నిధులతో జిల్లాలో రోడ్లు

● 16 పనులకు టెండర్ల ఆహ్వానం

● రూ.25 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు



రూ.కోటితో నిర్మించనున్న పోలూరు-రాయమాల్పురం రహదారి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీటీ రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయి. కూటమి ప్రభు త్వం వచ్చాక అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ముఖ్యంగా రహదార్ల నిర్మాణం గతంలో ఎన్నడూ లేనివిధంగా జరుగుతున్నాయని చెప్పుకోవచ్చు. గత వైసీపీ పాలనలో గుం తలమయమైన రహదారులను పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో నిర్మాణాలు చేపట్టేందుకు సమాయత్తమైంది. నాబార్డు ఆర్ఐడీఎఫ్-30 కింద జిల్లాకు 16పనులకుగాను రూ.25కోట్లు మంజూరుచేసింది. పంచాయతీరాజ్ శాఖ, పంచాయతీరాజ్ (పీఐయూ)లకు ఈ పనులు మంజూరుచేసింది. ఈ పనులకు టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు పూర్తయితే త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్‌శాఖ ఈఈలు నాగరాజు, రఘు రామిరెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ శాఖకు 6పనులకుగాను 11.20కోట్లు పీఆర్ (పీఐయూ)కు 10పనులకుగాను రూ.13.80కోట్లు నాబార్డు మం జూరుచేసింది. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. కొన్నిచోట్ల సీసీ, బీటీ రోడ్లు ఈ నిధులతో నిర్మాణం చేపట్టనున్నారు.

పీఆర్ (పీఐయూ) పరిధిలో: పాణ్యం నియోజకవర్గంలో గడివేముల-రేగడగూడూరు వయా కొర్రపోలూరు రహదారికి రూ.2.61కోట్లు. జేస్-ప్యాపిలి డీఆర్ రోడ్డు నుంచి తాండావరకు రూ.2కోట్లు. నందికొట్కూరు నియోజకవర్గంలో కొత్తపల్లె, ఆత్మకూరు, కొక్కెరంచ వయా దుద్యాల రోడ్డుకు రూ.2కోట్లునందికొట్కూరు-ముచ్చుమర్రి వయా నాగటూరు రోడ్డుకు రూ.45లక్షలు. పాములపాడు మండలంలో టీవో-1బై54/4నుంచి తుమ్మలూరు రోడ్డుకు రూ.34.5లక్షలు, టీవో-1/64బై0నుంచి సుంకులమ్మ కొట్టాల వయా వేంపెంట రహదారికి రూ.35లక్షలు. బనగానపల్లె నియోజకవర్గంలో పీపీజీ రోడ్డునుంచి తాడిపత్రి రోడ్డుకు రూ.2కోట్లు. సంజామల-వసంతపురం-కోత్రందిన్నె రోడ్డుకు రూ.కోటి. గిద్దలూరు నుంచి కమ్మవారిపల్లె రోడ్డుకు రూ.1.80కోట్లు, కమలపురి నుంచి కోత్రందిన్నె రోడ్డుకు రూ.95లక్షలు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో బాచేపల్లి-అహోబిలం రహదారికి రూ.2.85 కోట్లు. గోస్పాడు మండలంలో కామినేనిపల్లె వయా జిల్లెల్ల రోడ్డుకు రూ.3కోట్లు. నంద్యాల నియోజకవర్గంలో పోలూరు- రాయమాల్పు రహదారికి రూ.1కోటి, కానాల నుంచి మిట్నాల రహదారికి రూ.1.50కోట్లు. మహానంది మండలంలో ఎన్‌హెచ్-7నుంచి మసీదుపురం వరకు రూ.90లక్షలు. వెలుగోడు మండలంలో రేగడగూడూరు నుంచి కొర్రపోలూరు రహదారికి రూ.1.95కోట్లు.

టెండర్లు పూర్తయ్యాయి



పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఆళ్లగడ్డ మినహా మిగిలిన ఐదు పనులకు టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ అనంతరం పనులు ప్రారంభం అవుతాయి. 9నెలల నుంచి 12నెలల్లోపు పనులు పూర్తిచేయాల్సి ఉంది. త్వరలోనే రహదార్ల నిర్మాణం చేపడతాం. అనుకున్న సమయంలోనే పూర్తిచేస్తాం.

● నాగరాజు, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ, నంద్యాల

మోదుగపత్రంపై దుర్గాదేవి చిత్రాలు



చిత్రకారుడు కోటేష్



మోదుగ ఆకుపై దుర్గమ్మ చిత్రం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖచిత్రకారుడు చింతలపల్లె కోటేష్ దసరా నవరాత్రులను పురస్కరించుకుని మోదుగ ఆకుపై వివిధ రూపాలతో దుర్గాదేవి చిత్రాలను వివిధ రూపాల్లో వేశారు. కాళికామాతగా మహిషాసురుడనే రాక్షసుడితో భీకరమైన యుద్ధం చేసి త్రిశూలంతో సంహరిస్తున్నట్లు, అమ్మవారి వాహనమైన సింహం వీరగర్జన చేస్తున్నట్లు, అమ్మవారి రౌద్రరూపం, భీకరమైన యుద్ధం చేసి భూత పిశాచులు భయంతో పారిపోతున్నట్లు, మహిషాసురిని వదించిన తర్వాత అమ్మవారు తన శాంతమైన రూపంతో చిరునవ్వుతో భక్తులకు దీవిస్తున్నట్లు చిత్రాన్ని రూపొందించారు. దసరా పండుగ ప్రాముఖ్యత గురించి ఈ చిత్రం ద్వారా చిత్రకారుడు రూపొందించి ఔరా అనిపించాడు.

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

● ఇన్‌ఫ్లో 5,20,552, అవుట్ ఫ్లో 5,18,650 క్యూసెక్కులు

● సాగర్‌కు 10 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



శ్రీశైలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ జూరాల గేట్ల నుంచి శ్రీశైలం డ్యామ్‌కు 5,20,552 క్యూసెక్కులు వచ్చి చేరింది. శ్రీశైలం రిజర్వాయర్ ఒక్క స్పిల్ వే ద్వారా దిగువ సాగర్‌కు 5,18,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భారీగా వరద డ్యాంను చేరుతుండడంతో ఇంజ నీర్లు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని సాగనంపుతున్నారు. శ్రీశైలం డ్యాం 10 క్రస్ట్ గేట్లను 23 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సుంకేసుల 79,268 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 27వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. శ్రీశైలం కుడిగట్టు విద్యుదుత్పత్తి అనంతరం 29,444 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ఉత్పత్తి అనంతరం 35,315 క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 882 అడుగులుగా ఉండగా.. నీటి నిల్వ సామర్థ్యం 202 టీఎంసీలుగా ఉంది.

బీఎడ్ జస్ట్ చేయలేక..

● స్థానిక విద్యార్థులకు కఠినతర నిబంధనలు

● ఇతర రాష్ట్రాల అడ్మిషన్ల కోసం ఒప్పందాలు

● రంగంలోకి ఏజెంట్లు

● వత్తాసు పలుకుతున్న వర్సిటీ ఉన్నతాధికారులు



బీఎడ్‌లో స్థానిక విద్యార్థులను చేర్చుకునేందుకు కళాశాలల యాజమాన్యాలు ఆసక్తి చూపడంలేదు. వారిని అడ్జస్ట్ చేయలేక కఠినతర నిబంధనలు పెడుతున్నాయి. రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)కి అనుబంధంగా దాదాపు 49 బీఎడ్ కళాశాలలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నిర్వహించింది. దీంతో బీఈడీ కళాశాలలు ఒక్కసారిగా ఫీజులు పెంచేశారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు బీఈడీ కళాశాలల అక్రమాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ వారికి వత్తాసు పలుకుతున్నారు.

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎడ్‌సెట్- 2025 కౌన్సెలింగ్ ప్రారంభం కాక ముందే ఆయా కళాశాలలు బిహర్, ఒరిస్సా నాగాలాండ్, త్రిపుర, మీజోరం రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను చేర్చుకొని అడ్మిషన్లు పూర్తిచేశాయి. ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ద్వారా బీఎడ్ కళాశాలలకు అలాట్ అయిన విద్యార్థులకు కళా శాలలు కఠినతర షరతులు పెట్టి వెనక్కి పంపుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. స్థానిక బీఎడ్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూనివర్సిటీ ఉన్నతాధికారులు బీఈడీ కళాశాలల అక్రమాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ వారి వత్తాసు పలుకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో మూడు రోజుల్లో జరిగే మరో దశ కౌన్సెలింగ్‌లోనైనా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

లక్షల్లో ప్యాకేజీలు మాట్లాడుకొని..



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి నాయకులు (ఫైల్)

వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులను జిల్లాలోని బీఈడీ కళాశాలల్లో చేర్పించేందుకు ఏజెంట్లు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. లక్షల్లో ప్యాకేజీలు మాట్లాడుకొని స్థానిక యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారని, వీరికి వర్సిటీలోని కొందరు అధికారులు సహకరిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈతంతు దశాబ్ద కాలంగా సాగుతున్న విషయం తెలిసిందే. మరోమారు ఈదందాలకు ఏజెంట్లు తెగబడ్డారని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు.

ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

బీఎడ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని వైఎస్ ఆర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సురేష్ యాదవ్ అన్నారు. రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడుకు ఇటీవలే వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక విద్యార్థులకు కఠినమైన షరతులు పెట్టి వెనక్కి పంపుతున్నారు.

సమస్యలు తన దృష్టికి..

విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలి. బీఈడీ కళాశాలల్లో విద్యార్థుల చేరికలపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. విద్యార్థులు సమస్యను తన దృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తా.

● బోయ విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ

మహానందిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



జస్టిస్ భానుమతికి జ్ఞాపికను అందిస్తున్న వేదపండితులు

మహానంది, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం రాత్రి ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముఖద్వారం వద్ద అర్చకులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అభిషేకాలు, కుంకుమార్చన పూజలను చేశారు. న్యాయమూర్తిని వేదపండితులు సన్మానించి ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో నజీర్‌ఝా

బండిఆత్మకూరు, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను కాపాడుకుందామని ఎఫ్ఆర్వో నజీర్‌ఝా సూచించారు. ఆదివారం మండలంలోని నల్లమల సమీప గ్రామాలైన ఎరుకల కాలనీ, శింగవరం, సోమయాజుపల్లె, జీసీపాలెం, నారాయణపురం, బరకలకాలనీ, నారపురెడ్డికుంట, నెమిళ్లకుంటల్లో ప్రజలకు వన్యప్రాణుల రక్షణపై అవగాహన కల్పించారు. వాల్‌పోస్టర్లు అంటించారు. ఎఫ్ఆర్వో మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే జైలు శిక్ష తప్పదన్నారు. ఎవరైనా ఉచ్చులు బిగించినా, వన్యప్రాణుల మాంసాలు విక్రయిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. అటవీ సంపద, వన్యప్రాణులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలి



దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్ కోరారు. ఆదివారం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేని ప్రాంతాలను, వర్షపునీరు నిలిచిన రోడ్లను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆత్మకూరులో 15ఏళ్ల క్రితం డ్రైనేజీలు ఏర్పాటు చేశారన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. దీనివల్ల దోమల వ్యాప్తి పెరిగి రోగాలు ప్రబలుతున్నాయన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, అంబయ్య తదితరులున్నారు.

స్వదేశీ వస్తువులను వినియోగించాలి



బొల్లవరంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్ గౌడ్

మహానంది, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులను మాత్రమే వినియోగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేతు కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం బొల్లవరం గ్రామంలో స్వదేశీ ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా స్వదేశీ, ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్‌పై గ్రామ ప్రధాన కూడలిలో కిరణ్‌కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు సుబ్బారెడ్డి రాంబాబు, బండిఆత్మకూరు మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శివ జనసేన నాయకులు మహేశ్వరయ్య, డమాల చందు, కామిని ప్రసాద్, చక్రపాణి, మురళీలు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన అజయ్‌కుమార్ విరాళం అందజేశారని ఆలయ పర్యవేక్షకుడు నీలకంఠేశ్వరరాజు తెలిపారు. ఆదివారం విరాళాల కౌంటర్‌లో అన్నదాన పథకానికి రూ. రూ.51 వేలు విరాళం అందజేశారు. దాతకు స్వామి మోమెంటోను బహూకరించి ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఇన్‌చార్జి రామశివ పాల్గొన్నారు.

శోభాయమానం.. అమ్మవారి అలంకారం

- కొనసాగుతున్న దేవీ నవరాత్రోత్సవాలు
- అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు

జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ రూపాల్లో అమ్మవార్లు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

- ఆంధ్రజ్యోతి- నెట్‌వర్క్



నంద్యాల కల్చరల్: మహాలక్ష్మీదేవి, కాత్యాయనిదేవిగా..



నంద్యాల కల్చరల్ : సంజీవనగర్ రామాలయంలో కాత్యాయనీదేవి అలంకారంలో అమ్మవారు



బండిఆత్మకూరు: వనదేవతాగా దర్శనమిచ్చిన ఉమామహేశ్వరీదేవి









నందికొట్కూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లోని ఆలయాల్లో మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



పాములపాడులో అమ్మవారి ..



నంద్యాల కల్చరల్ : కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో విజయదుర్గాదేవిగా..



నంద్యాల కల్చరల్ : మహాచండీదేవి అలంకారంలో నిమిషాంబదేవి



ఆత్మకూరు: మహాగౌరీ దేవీగా అలంకరణలో వాసవీమాత



గడివేముల: శాకాంబరిదేవిగా అమ్మవారు

సామాజిక చైతన్యవాది 'జాషువా'



ఆత్మకూరు: జాషువా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యవాది గుర్రం జాషువా అని వక్తలు అన్నారు. ఆదివారం పట్టణంలోని రోటరీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మిడ్‌టౌన్ రోటరీక్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు కేశవమూర్తి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కవి గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోటరీక్లబ్ మాజీ గవర్నర్ చిన్నపురెడ్డి హాజరై జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ జాషువా కేవలం కవి మాత్రమే కాదని ఆయనొక సామాజిక చైతన్యవాది అన్నారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి నంద్యాల జిల్లా కార్యదర్శి డా. నీలం వెంకటేశ్వర్లు, మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ సభ్యులు అవ్వారి శేషఫణి, అన్నెం శ్రీనివాసరెడ్డి, మధురవాణి, రమేష్, కాల్వ నాగరాజు, నీలకంఠమాచారి, ప్రసాద్, గోపి పాల్గొన్నారు.

ఆత్మకూరు: కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరబడి సమసమాజ నిర్మాణ స్ఫూర్తిదాత గుర్రం జాషువ అని కుల వివక్ష పోరాట సమితి జిల్లా నాయకులు ఏసురత్నం, భాస్కర్ అన్నారు. ఆదివారం గుర్రం జాషువ జయంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో జాషువ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తు చేసుకున్నారు. కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఏపీపీహెచ్‌సీ వైద్యుల సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన వైద్యుల సంఘం సభ్యులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యుల సంఘం కార్యవర్గ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో రిటర్నింగ్ అధికారి డాక్టర్ లలిత ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో ఉదయం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో 82 మంది వైద్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడుగా కే అంకిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్ చెన్నకేశవులు, కోశాధికారిగా నేగల ఉసేని, గౌరవ సలహాదారులుగా మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, భగవాన్‌దాస్, నాగలక్ష్మి, బాబు, రంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రసన్నలక్ష్మి, కాంతారావునాయక్, ప్రణీత్, మహిళా కార్యదర్శిగా నిర్మల్‌శ్రీజ, సహాయ కార్యదర్శులు, కోశాధికారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

ఆత్మకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్, డీవైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు రామ్‌నాయక్ కోరారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దినేష్‌కుమార్ మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్ ఆదర్శంగా తీసుకుని దేశ అభ్యున్నతికి పాటుపడాలని ఆకాంక్షించారు.

ఏఐటీయూసీ కార్యాలయంలో..

నందికొట్కూరు: పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురాంమూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటరమణ, మధు, వంశీ, అన్వర్‌బాషా, కరుణాకర్ పాల్గొన్నారు.



నందికొట్కూరులో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ యాప్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శిల్పా

నందికొట్కూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకే డిజిటల్ బుక్ యాప్‌ను తీసుకొచ్చినట్లు ని యోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ అన్నారు. ఆదివారం ప ట్టణంలోని తన నివాసంలో డిజిటల్ బుక్ యాప్ పోస్టర్‌ను వైసీపీ నా యకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా మండలాల జడ్పీటీసీ సభ్యులు యుగంధర్‌రెడ్డి, సోములసుధాకర్‌రెడ్డి, నాయకులు రమేష్ నాయుడు, మన్సూర్ అహ్మద్, నాగిరెడ్డి, మచ్చ నాగరాజు పాల్గొన్నారు.

మాది డిజిటల్ బుక్ : శిల్పా

వెలుగోడు : అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ అమలు చేస్తోందని, తాము అధికారంలోకి వచ్చాక డిజిటల్ బుక్ అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులతో కలిసి డిజిటల్ బుక్ స్కానర్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపంరెడ్డి, రమేశ్, రామసుబ్బారెడ్డి, షంషీర్, ఇలియాస్, ఆత్మకూరు నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో తుగ్గలి నాగేంద్ర

శ్రీశైలం,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా పుణ్యక్షేత్రాన్ని ఆదివారం టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు సాదర స్వాగతం పలికారు. స్వామి,అమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి శేషవస్త్రములతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

గుర్రాలు తగిలి ఇద్దరికి గాయాలు

మహానంది, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహానంది స మీపంలోని నంద్యాల-మహానంది ప్రధాన రహదారిలో గుర్రాలు తగిలి మహానంది ఆలయంలో ఏజెన్సీ ప్రతిపాదికన విధులు నిర్వ హిస్తున్న బుక్కాపురానికి చెందిన ప్రహ్లాదుడు, తమ్మడపల్లికి చెంది న మహేష్ గాయపడ్డారు. ప్రహ్లాదుడు మహానందిలో విధులు ముగిసిన తరవాత బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా తెలుగుగంగ ప్రధాన కాల్వ సమీపంలోకి రాగానే గుర్రాలు తగలడంతో కిందపడగా తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే మరో ఉద్యోగి మహేష్ భారీ నంది విగ్రహం సమీపంలోని ప్రధాన రహదారిపైకి ఆకస్మాత్తుగా గుర్రం రావడంతో తగిలి కిందపడ్డాడు. నంద్యాల్లోని ప్రైవేట్ వైద్యశాలకు మిగతా ఉద్యోగులు తరలించారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక



ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యులు

నందికొట్కూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం పట్టణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా భీమిశెట్టి మనోజ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా భీమిశెట్టి జయరామకృష్ణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బచ్చు శ్రీనువాసులు, కోశాధికారిగా వీరబొమ్మ శ్రీనివాసులు, సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే వాసవి సేవాదళ్ అధ్యక్షుడిగా గ్రంథె క్రిష్ణమూర్తి, యువజన సంఘం అధ్యక్షుడిగా బైసాని శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా దొంతు నిహాంత్, కోశాధికారిగా కొవ్వూరు పద్మకుమార్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం యువజన సంఘం, వాసవి మహిళా మండలి, వాసవి సేవాదళ్, అవోపా, మిత్ర సంఘాల సభ్యులు హాజరయ్యారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం : రైతు సంఘం

బండిఆత్మకూరు సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల సంక్షేమం కోసం పోరాటాలు చేస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం బండిఆత్మకూరు మార్కెట్ యార్డులో జిల్లా రైతుసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా పోరాడతామన్నారు. వ్యకాస నాయకుడు రత్నమయ్య మాట్లాడుతూ రామాపురం నీటి మునక పొలాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వ్యకాస నాయకులు డేవిడ్, రామచంద్రుడు, సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సర్వారెడ్డి, మదార్‌వలి, ఎల్లయ్య పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై రాజీలేని పోరాటాలు



పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో పట్టణ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు నిర్మల పాల్గొన్నారు.

పట్టణ కమిటీ ఎన్నిక..

నూతన ఐద్వా పట్టణ కమిటీని ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శిగా సుజాత, హైమావతి, ఉపాధ్యక్షులుగా శివమ్మ, సునీత, కార్యదర్శులుగా కృష్ణవేణి, ప్రసన్నలతో పాటు మరో41 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

బంగారు నాగపడగ వితరణ

పాణ్యం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు బంగారు నాగపడగను వితరణ చేశారు. ఆదివారం నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన దంపతులు నాగమనోహర్, సరిత పది గ్రాముల బంగారు నాగపడగను ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డికి అందజేశారు. అంతకుముందు దాతలు స్వామివారికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు.

వంతెన నిర్మాణంపై దృష్టి సారించాలి



ఎద్దులేరు వాగును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం గ్రామ శివారులోని ఎద్దులేరు వాగుపై వంతెన నిర్మాణంపై నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యదర్శి సికిందర్, మండల అధ్యక్షుడు అతావుల్లాలతో కలిసి ఆయన ఎద్దులేరు వాగును పరిశీలించారు. అనంతరం మద్దిలేటి మాట్లాడుతూ ప్రతి ఏటా వర్షాకాలంలో ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తూ 12 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈ విషయం ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు తెలిసినా కూడా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల ఆగ్రహానికి గురి కాకముందే వాగుపై వంతెన నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఫైల్‌మాన్, నూరుల్లా పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహిద్దాం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అణగారిపోతున్న కళలను ప్రోత్సహిద్దామని నంద్యాల పట్టణ 38వవార్డు టీడీపీ ఇన్‌చార్జి బుగ్గరాముడు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో దసరా వేషదారులకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పండుగలలో భారతీయ కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు శంకర్, బైటిపేట కళాకారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారిణికి ఘన సన్మానం



చిన్మయి శ్రేయను సన్మానిస్తున్న వాసవి యువసేన సమితి నాయకులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారిణి చిన్మయి శ్రేయను ఆదివారం శ్రీవాసవీ యువసేన సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యువజన సంఘం నాయకులు వెన్నెల శ్రీకాంత్, ఆర్బి సునీల్ కుమార్ , వంకదార శబరి, రాజేష్ కుమార్ ఆర్‌పీ మణికంఠ మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌లో పీవీ సింధూ మాదిరిగా , ఫెన్సింగ్‌లో పబ్బతి చిన్మయి శ్రేయ మున్ముందు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు వేణు, అపర్ణలను అభినందించారు. అనంతరం చిన్మయ శ్రేయాను శాలువా కప్పి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో పవన్, సుధీర్, రఘు, ప్రసాద్, హరి పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీని దించేద్దాం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



పోస్టర్ విడుదల చేస్తున్న లక్ష్మీనరసింహాయాదవ్

కల్లూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపిని గద్దెదించేందుకు లక్ష సంతకాల సేకరణ నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవన్‌లో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్‌పార్టీ దేశవ్యాప్త ఉద్యమం పోస్టర్లు విడుదల చేశారు. అక్టోబరు 15 వరకు దేశవ్యాప్తంగా పార్టీ తలపెట్టిన లక్ష సంతకాల సేకరణ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని నాయకులను కోరారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని ఆరోపించారు. ఫొటోలతో స్పష్టమైన ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ఎన్నికల ముందు జాబితాలో చేసిన మార్పులు, చేర్పులను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల చివరి నిమిషంలో ఓట్ల తొలగింపు, చేర్పులను నివారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పఠాన్ అబిబ్‌ఖాన్, రమణ, జనార్ధన్, రజాక్‌వలి, షేక్ జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

బందోబస్తులో ఉంటూనే కేసు ఛేదింపు

● ఆత్మకూరు ఎస్ఐను అభినందించిన ఎస్పీ

ఆత్మకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల బందోబస్తులో ఉంటూనే ఓ అదృశ్యం కేసును ఆత్మకూరు ఎస్ఐ ఛేదించారు. దీంతో ఆయనను ఆదివారం ఎస్పీ సునీల్ షెరాన్ అభినందించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువులో శాంతిబాయి అనే మహిళ నివసించేది. ఆమె భర్త చనిపోవడంతో శ్రీశైలంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తుండేది. ఈక్రమంలోనే పలమనేరుకు చెందిన మూర్తితో పరిచయం ఏర్పడి రెండో పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత ఇంటి నుంచి వెళ్లిపోయి తిరుమలలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. మొదటి భర్త కుమారుడైన విశ్వేశ్వరనాయక్ 2023 మే 16వ తేదీన ఆత్మకూరు పోలీసులకు తన తల్లి అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును ఛేదించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణలో బందోబస్తు కోసం ఎస్ఐ నారాయణరెడ్డి తిరుమలకు వెళ్లారు. యాధృచ్ఛికంగా శాంతిబాయి వివరాలు లభ్యం కావడంతో ఆమె ఆచూకీని గుర్తించారు. ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు చెందిన మహిళా పోలీసు కానిస్టేబుల్ స్వర్ణ సహాయంతో వాగ్మూలం రికార్డు చేయించారు విశ్వేశ్వరనాయక్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. శాంతిబాయిని ఆమె రెండో భర్త మూర్తికి అప్పగించారు. 2023లో నమోదైన మిస్సింగ్ కేసును బాధ్యతాయుతంగా ఛేదించిన ఎస్ఐ నారాయణరెడ్డిని ఎస్పీ అభినందించారు.

తామ్ర శాసనాలపై పుస్తకం రూపకల్పన

● ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నం



రాగిరేకులను పరిశీలిస్తున్నఅమిషా (ఫైల్)



శ్రీశైలం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గల ఘంట మఠంలో 2021లో లభ్యమైన తామ్రశాసనాలపై పుస్తకాన్ని రూపొందించినట్లు ఏఎస్ఐ (ఆర్కియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా)మైసూర్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. తామ్రశాసనాలపై లిఖించిన వాటిని డైరెక్టర్ ఎపిగ్రఫి మైసూర్ వారు 'హర్డ్ ఆఫ్ కాపర్ ప్లేట్స్ ఫ్రమ్ శ్రీశైలం' అనే పుస్తకాన్ని తయారు చేశారన్నారు. అమిత్‌షా కూడా శ్రీశైలాన్ని సందర్శించినప్పుడు డిస్‌ప్లేలో ఉంచిన తామ్రాశాసనాలను పరిశీలించారు. అక్టోబరు 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం రానున్నారు. ఈ సందర్భంగా తామ్రాశాసనాలు(రాగిరేకులు) గురించి డిస్‌ప్లేలో ఉంచుతారని దేవస్థాన అధికారులు తెలిపారు. ప్రధాని చేతులమీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తామని సీఎం నారా చంద్రబాబునాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది.

బీట్ కేర్‌ఫుల్



మన గుండె ఉండేది పిడికెడే. నిలువెత్తు మనిషిని నడిపిస్తుంది. ఇటీవల కాలంలో గుండె లయ తప్పుతోంది. గుండె పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. యువత, టీనేజర్లు గుండెపోటుతో కుప్పకూలుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లాలో ఎక్కువయ్యాయి. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిలో అత్యధికులు గుండె జబ్బులతో సతమతమవుతున్నారు. కరోనా అనంతరం చోటుచేసుకున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లలోని మార్పులు, హార్ట్ ఎటాక్‌లకు కారణమవుతున్నాయి. గుండె జబ్బులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 2000 సంవత్సరం నుంచి వరల్డ్ హార్ట్ ఫెడ రేషన్ ఏటా సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్‌డే నిర్వహిస్తుంది. ఈఏడాది 'డోంట్ మిస్ బీట్ ' అన్న నినాదాన్ని ఇచ్చింది. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

- వ్యాయామంతోనే గుండె పదిలం
- ఆధునిక జీవన శైలే కారణం
- చిన్న వయస్సులోనే హార్ట్ ఎటాక్
- నేడు వరల్డ్ హార్ట్ డే



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గుండె జబ్బులతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏటా 30వేల మంది రోగులు చికిత్స పొందుతుంటారు. కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియాలజి విభాగానికి 2024-25 సంవత్సరానికి 22,325 మంది ఓపీ కేసులు రాగా, ఇందులో 4,281మంది అడ్మిషన్ పొంది చికిత్స పొందుతుంటారు. కర్నూలు జీజీహెచ్‌కు ప్రతి రోజూ 3వేల మంది ఓపీకి వస్తుండగా.. ఇందులో 60 నుంచి 70 కేసులు హార్ట్ ఎటాక్ లక్షణాలతో చికిత్స పొందుతుంటారు. ఇందులో 25నుంచి 40ఏళ్లలోపు ఉన్నవారు ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడుతున్నారు. ప్రతి నెల కార్డియాలజీకి ఓపీకి 1300 నుంచి 1400 మంది రోగులు రాగా, ఇందులో 300 నుంచి 350 మంది అడ్మిషన్ అయి చికిత్స పొందుతుంటారు. ప్రతిఏడాది కార్డియాలజి వైద్యులు 1,235 మందికి అంజి యోగ్రామ్, 423 మందికి అంజియోప్లాస్టి చికిత్సలను డా.ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నారు.

పట్టణాల్లో ఎక్కువ

జీవనశైలిలో మార్పులే గుండెపోటుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. యువతలో గుండె సమస్యలు అధికమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలతో పాటు గ్రామాల్లోను అందరి ఆహారపు అలవాట్లు మారాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు బేకరీ, జంక్‌ఫుడ్, మాంసాహారం, మసాలా, బిర్యానీలు ఎక్కువగా తింటున్నారు. దీని వల్ల శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోయి ఆయాసం, నీరసం ఇతర సమస్యలకు కారణమవుతున్నాయి. గతంలో 50ఏళ్లు దాటిన వారికి మాత్రమే గుండెపోటు వచ్చేది. ప్రస్తుతం 25ఏళ్ల వారు సైతం దీని బారినపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో 13 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 8 శాతం మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

● ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. యోగా, ధ్యానం చేయాలి. బచ్చలకూర, కాలిఫ్లవర్, టమోటా, క్యాబేజీ, క్యారెట్, పాలకూర, కూరగాయలు తీసుకోవాలి. పొగాకు ఉత్పత్తులు, మద్యపానంకు దూరంగా ఉండాలి. కొలస్ట్రాల్ స్థాయిని తగ్గించుకుని బీపీ, షుగర్ వ్యాధిని తగ్గించుకోవాలి.

● సంగీతం వినాలి. పాతపాటలు మనస్సుకు ఎంతో హాయిని ఇచ్చి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ప్రతిరోజు 7నుంచి 8గంటలు బాగా నిద్రపోవాలి. నూనెలో వేయించిన ఆహారాన్ని తగ్గించాలి. కొర్రలు, సజ్జలు, జొన్నలు, బ్రౌన్ రైస్, ఓట్స్ వంటి తృణధాన్యాలు తీసుకోవాలి.

ప్రతి రోజు 30 కేసులు



కార్డియాలజి విభాగానికి ప్రతి రోజూ ఓపీ ఉంటుంది. ఓపీకి రోజూ 30 కేసులు వస్తుంటాయి. మంగళ, శుక్రవారాల్లో ఒక్కొక్కరికి ఓపీకి 200 మంది రోగులు వస్తారు. చెస్ట్ పెయిన్, ఆయాసం లక్షణాలతో రోగులు రాగా, వారికి ఈసీజీ, టుడి ఇనో పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తాం.

● డాక్టర్ పి.ప్రశాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజి, జీజీహెచ్, కర్నూలు

గుండె ఆరోగ్యం మన చేతిలోనే



ప్రపంచ వ్యాప్తంగా గుండె జబ్బులు మరణాలకు ప్రధాన కారణంగా మారాయి. గతంలో వృద్ధుల్లో మాత్రమే హార్ట్ ఎటాక్‌లు కనిపించేవి. ఇప్పుడు యువతలో కూడా వేగంగా పెరిగాయి. గుండె ఆరోగ్యం మన చేతిలోనే ఉంది. రోజు నడక, వ్యాయామంతో పాటు ధ్యానం అలవాటు చేసుకోవాలి.

- డా.సీఎస్ తేజానందన్ రెడ్డి, కన్సల్టెంట్ ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

నిర్లక్ష్యం వద్దు



గుండెనొప్పి అరగంట కన్నా ఎక్కువగా ఉంటే నిర్లక్ష్యం చేయరాదు. అది హార్ట్ ఎటాక్‌లా భావించాలి. చెమట పడటం, చేయిలాగడం, నడిస్తే ఆయాసం రావడం వంటి లక్షణాలు ఉంటే వైద్యున్ని సంప్రదించాలి.

● డాక్టర్ సందీప్‌కుమార్, ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

పొగాకు వినియోగం..



గుండె జబ్బులు రావడానికి పొగాకు వినియోగం ముఖ్య కారణం. ప్రధానంగా స్మోకింగ్ చేసే అలవాటు ఉన్న వారిలో హార్ట్ ఎటాక్ ఎక్కువగా వస్తుంది. స్మోకింగ్, ఆల్కహాల్ వంటివి గుండె కండరాలపై ప్రభావం చూపుతాయి.

- డాక్టర్ అనిరుధ్‌కుమార్, ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, విజయదుర్గ కార్డియాక్ సెంటర్, కర్నూలు

గుండెను కాపాడుకోవాలి

-మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మద్యపానం, ధూమపానం వంటి దుర అలవాట్లకు దూరంగా ఉండి గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. నగరంలోని హెల్త్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వరల్డ్ హార్ట్ డే వేడుకలకు టీజీ వెంకటేశ్‌తో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా హైదరాబాదు అపోలో హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కార్డియాలజిస్టు ప్రతాప్ చంద్రరత్‌కు అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ఇయర్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ గుండె జబ్బుల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ఇటీవల కాలంలో యువత గుండెజబ్బుల బారిన పడుతున్నారన్నారు. దీని కారణాలను వైద్యులు విశ్లేషించాలన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ 50 శాతం మంది గుండె జబ్బులతో మరణిస్తున్నారన్నారు. ప్రతిరోజు 40 నిమిషాలు నడవడం, యోగా, సరైన ఆహార నియమాలు పాటిస్తే హృద్రోగ సమస్యలు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ వీసీ చంద్రశేఖర్, హార్ట్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ భవాని ప్రసాద్, వసంత్ కుమార్, చంద్రశేఖర్, కేవీ సుబ్బారెడ్డి, పొలిటికల్ అనలిస్ట్ నాగేశ్వర్ బాబు, రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా, కేసీ రాముడు, శర్మ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనకు హాజరైన అతిథులు

సమ సమాజ కృషీవలుడు జాషువా

- కవులు, కళాకారుల ఘన నివాళి

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమసమాజం కోసం తన రచనలతో మార్పు తీసుకొచ్చిన సాహితీ కృషీవలుడు గుర్రం జాషువా అని పలువురు కవులు, కళాకారులు కొనియాడారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. సభకు అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జాషువా ఉపాధ్యాయుడిగా, కవిగా, సంఘ సంస్కర్తగా నమ్మిన సిద్ధాంతంతో ముందుకు పోయారన్నారు. ఆయన రాసిన క్రీస్తు చరిత్ర పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. శాసన మండలిలోనూ రాజకీయాలకు బదులు ఆయన పద్యాలు వినిపించేవారని అన్నారు. కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ మాట్లాడుతూ సంప్రదాయ వాదానికి విరుద్ధంగా ఆయన రచనలు చేశారని, అనేక అంశాలను ఆయన ప్రశ్నిస్తూ చైతన్య గీతాలు రాశారని గుర్తు చేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ జాషువా రాసిన గబ్బిలం పుస్తకంపై మాట్లాడుతూ జాషువా సాహిత్యంలో అత్యంత ప్రతిభాశాలి అయినా సామాన్యులకు అర్థమయ్యే భాషలోనే పద్యాలు రాశారని అన్నారు. కులతత్వానికి వ్యతిరేకంగా ఈ కావ్యం ఉంటుందని తెలిపారు. డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ జాషువా రాసిన పిరదౌసి కావ్యం ప్రత్యేక గుర్తింపును అందుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, గజల్ గాయకుడు మహమ్మద్ మియా, సాహితీ స్రవంతి ప్రతినిధి ఎంపీ బసవరాజు, కళాకారులు కేవీ రమణ, శామ్యూల్, వాల్మీకి రాముడు, చల్లా నవీన్ కుమార్ నాయుడు జాషువా రాసిన కావ్యాల్లోని పద్యాలను పాడి ప్రేక్షకులను మెప్పించారు. కార్యక్రమంలో కవులు, కళాకారులను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య శాలువలతో ఘనంగా సత్కరించారు. కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, ఇతర ప్రతినిధులు పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ శంకరప్ప, ఉపాధ్యాయురాలు హసీనా, గద్వాల ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళారత్న పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు

అహోబిలంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



అహోబిలంలో ప్రహ్లదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవార్ల గ్రామోత్సవం

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం దిగువ అహోబిలంలో అద్దాల మండపంలో ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవార్లకు ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియర్ సౌమ్యనారాయణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందికొట్కూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. ఓర్వకల్లు మండలం నన్నూరుకి చెందిన ఖాజాభాష(30) భార్య చెప్పకుండా పుట్టింటికి వెళ్లిందని మనస్తాపానికి గురై నందికొట్కూరుకు వచ్చాడు. శివారులోని మిడ్తూరు రోడ్డులో ఈనెల 10వ తేదీన పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రైతులు, కూలీలు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

అనకాపల్లిలో రోడ్డు ప్రమాదం..

కర్నూలు వాసి దుర్మరణం

అనకాపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పులపర్తి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లాకు చెందిన ఓ నేవీ ఉద్యోగి మృతిచెందారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా... కర్నూలు నగరంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన పి.రఘురామిరెడ్డి నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. కొంతకాలం నుంచి హైదరాబాద్ నగర శివారులోని అల్మాస్‌గుడ వినాయక హిల్స్‌లో నివాసం వుంటున్నారు. వ్యక్తిగత పనిమీద విశాఖపట్నం వచ్చిన ఆయన ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి మీదుగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్నారు. ఎలమంచిలి మండలం పులపర్తి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న పులి మల్లికార్జున్ అనే స్థానికుడిని బలంగా ఢీకొన్నారు. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైర్‌ను ఢీకొన్నది. నుదుటిపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మల్లికార్జున్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇతనిని ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎలమంచిలి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి, మృతునివద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు.



నందవరంలో శ్రీ కాత్యాయనీమాత కాళరాత్రి అలంకారంలో శ్రీచౌడేశ్వరీమాత అమ్మవారు



గూడూరు: మహాఛండీ అలంకరణలో సుంకులా పరమేశ్వరి అమ్మవారు




నంద్యాల: సత్యసాయి మందిరంలో లక్ష్మీనారాయణ అలంకరణ



కర్నూలులోని గోదా గోకుల క్షేత్రంలో మహాలక్ష్మిదేవి అలంకరణ



కల్లూరు అమ్మవారిశాలలో బ్రహ్మదేవుని అలంకరణ



మంత్రాలయం: రజత సింహ వాహనంపై మంచాలమ్మను అలంకరించిన దృశ్యం

ఆధ్యాత్మిక వీచికలు.. ధార్మిక భావనలు

- ఏడో రోజున అమ్మవారికి విశేష అలంకరణలు

కర్నూలు కల్చరల్/ బనగానపల్లె/ మంత్రాలయం/గూడూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. అన్ని ఆలయాల్లోనూ ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబిస్తోంది. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం కర్నూలు పూలబజార్‌లోని చిన్న అమ్మవారిశాలలో అమ్మవారు వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. పాతనగరంలోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ద్వాదశ ఆదిత్యుల అలంకరణలో కనిపించారు. గోదాగోకుల క్షేత్రంలో అమ్మవారికి మహాలక్ష్మిదేవి అలంకరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు బ్రహ్మదేవుడు, లలితా పీఠంలో అమ్మవారిని పసుపుతో అలంకరించారు.

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ రజత సింహవాహనంపై దర్శనమిచ్చారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనగానపల్లె మండలం నందవరంలోని చౌడేశ్వరీమాత కాళరాత్రి మాత అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గూడూరు మండలం కె.నాగులాపురంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కాళరాత్రిదుర్గగా కామేశ్వరీదేవి

మహానంది: మహానంది క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం కామేశ్వరీ అమ్మవారు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో హోమాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా వర్షం కారణంగా రాత్రి అమ్మవారి గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. ఉత్సవ ఏర్పాట్లను ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.



మహానందిలో సహస్రదీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

గత జ్ఞాపకాలు మెరిసె.. మనసు విరిసె



గురువులతో పూర్వ విద్యార్థులు

శిరివెళ్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువా, పూల మాలలు వేసి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

నాగేశ్వరమ్మకు కీర్తి చక్ర అవార్డు



కీర్తి చక్ర పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరమ్మ

చాగలమర్రి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న మారంరెడ్డి నాగేశ్వరమ్మ కవితలు రాయడంలో ప్రతిభ కనబరిచి కీర్తిచక్ర పురస్కారం అవార్డు అందుకున్నారు. హైద రాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన కవితా పోటీల్లో పాల్గొని ప్ర తిభ కనబరిచారు. ఆమెకు జ్ఞాపిక, స్వర్ణకంకణం, బంగారు పతకం అలంకరించి సత్కరించారు. జనజాగృతి కళాసమితి ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించినట్లు అవార్డు గ్రహీత పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో మేలు

బనగానపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో మేలని టీడీపీ సీనియర్ నాయకుడు, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఇల్లూరు కొత్తపేట సచివాలయ పరిధిలోని మిట్టపల్లెలో వీఆర్వో మధుతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రామసుబ్బారెడ్డి, నారపరెడ్డి, రామసుబ్బారెడ్డి డీలర్‌హుసేన్‌రెడ్డి, చిన్నగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలానికి 8,278 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరైనట్లు తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు.వీటిని ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.

కార్యకర్తల మనోధైర్యం కోసమే డిజిటల్ బుక్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

డోన్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు మనోధైర్యం ఇచ్చేందుకే పార్టీ అధిష్టానం డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, పార్టీ జిల్లా వలంటరీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసా ద్, జడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం పట్టణం లోని వైసీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ దాడులకు గురైనా, అన్యాయానికి గురైనా వాటి తీవ్రతను బట్టి కార్యకర్త డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, పార్టీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, ధర్మవరం సుబ్బారెడ్డి, బేతంచెర్ల నాయకులు తిరుమ లేశ్వరరెడ్డి, ప్యాపిలి నాయకులు పోదొడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా నవరాత్రి దాండియా వేడుకలు

● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



దాండియా వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని వెంకటాచలం ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి జరిగిన తరంగ్ నవ రాత్రి దాం డియా వేడుకలు ఘనంగా జరిగాయి. డోన్ పట్టణం 2వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఎన్‌ఈ సరోజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. సంప్రదాయ నృత్యాలతో, ఉత్సాహభరితమైన దాండియా ప్రదర్శనలతో వేడుకలు సందడి వాతావరణంలో కొనసాగింది. స్థానిక యువత, కుటుంబ సభ్యులు పాల్గొని ఈ ఉత్సవాలు జరుపుకున్నారు. అనంతరం కోట్ల సుజాతమ్మ మహిళలు, యువతులతో కలిసి కోలాట వేడుకల్లో పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ టీకాలు

బనగానపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా బనగానపల్లె పశువైద్యశాలలో ఆదివారం పశువైద్య శాఖ ఏడీ మారుతీ సకారం ఆధ్వర్యంలో కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల యజ మానులు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా



టంగుటూరు శీనయ్యకు స్వాగతం పలుకుతున్న సుబ్రహ్మణ్యం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షు డు, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. ఆదివారం కోవలకుంట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, యువజన అధ్యక్షుడు కర్నాటి అభిలాష్ ఆహ్వానం మేరకు టంగుటూరు శీనయ్య కోవెలకుంట్లకు వచ్చారు. శీనయ్యతో పాటు వెంకటసుబ్బయ్య, నాగరాజులను ఘనంగా సన్మానించారు.

అబ్బురపరచిన అమ్మవారి అలంకారాలు


దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



ఉయ్యాలవాడ: మహాచండీదేవి అలంకారంలో అమ్మవారు



బనగానపల్లె: కాత్యాయనీమాత అలంకారంలో శ్రీచౌడేశ్వరీ దేవి



ప్యాపిలి: మహాగౌరిదేవి అలంకరణలో అంకల పరమేశ్వరీదేవి



డోన్: మహాచండీ అలంకరణలో అమ్మవారు



ఆళ్లగడ్డ: కాళీమాత ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా...



బనగానపల్లె: మహాలక్ష్మీదేవి అలంకారంలో వాసవీమాత



డోన్‌లో స్కంద మాత అలంకరణలో వాసవీ మాత



కోవెలకుంట్లలో గజలక్ష్మి అలంకారం



చాగలమర్రి: ముత్యాలపాడులో భవానిదేవి అలంకారం



రుద్రవరం: శాకాంబరి అలంకారంలో అమ్మవారు



దొర్నిపాడు: శారదాదేవి అలంకారంలో అమ్మవారు



కొలిమిగుండ్ల: అష్టలక్ష్మి అలంకారం



అవుకు: ధనలక్ష్మీ దేవి అలంకారంలో వాసవీమాత



మహా చండీ గౌరీ దేవి అలంకరణలో అమ్మవారు

ప్రత్యామ్నాయం చూపి పాఠశాల తొలగించాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఖాళీ చేయాలని జాతీయ రహదారి అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ప్రత్యామ్నాయం చూపి పాఠశాలను తొలగించాలని గ్రామ సర్పంచ్ హేమలత, టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డి కోరారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 2003లో దివంగత నేత ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి, భూమా నాగిరెడ్డి సహకారంతో రూ.1.40లక్షలతో గ్రామానికి దగ్గరగా ప్రాథమిక పాఠశాలను నిర్మించారన్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో పాఠశాల తొలగించాలని హైవే అధికారులు నోటిసులు ఇచ్చారన్నారు. ముందు భవనాన్ని నిర్మించి తరువాత పాఠశాలను తొలగించాలని ఎంఈఓ, ఎంపీడీవోలను కోరామన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన పాఠశాలను నిర్మించాలని వారు కోరారు.

దెబ్బతిన్న పంటలు.. నష్టాల్లో రైతులు



నేలంపాడులో నీట మునిగిన బెండ పంట



ప్యాపిలి మండలంలో వర్షాలకు దెబ్బతిన్న టమోట

చాగలమర్రి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరక దిక్కుతోచక దిగులు చెందుతున్నారు. మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో ఎగువ నుంచి వచ్చిన వక్కిలేరు వరద నీరు పొంగి ప్రవహించింది. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించాయి. రాంపల్లె, నేలంపాడు, గొట్లూరు, ఆవులపల్లె, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో వరద నీటితో పంటలు నీట మునిగి దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. 600 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో బెండ, 300 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిని రైతులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. వరద నీరు పంట పొలాల్లో నిల్వ ఉండటంతో పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పంట పొలాలను పరిశీలించి వరద నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్యాపిలి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో టమోట పంట దెబ్బతింది. ఖరీఫ్‌లో దాదాపు 5వేల ఎకరాల్లో టమోట సాగు చేశారు. ఎకరాకు దాదాపు రూ.15వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాయలు దెబ్బతింటున్నాయి. వర్షాలకు కాయలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

చాగలమర్రి: మండలంలో భారీ వర్షాల వల్ల 900 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచన వేశామని ఏవో రంగనేతాజీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న, జూట్, మిను ము, కంది పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వివరాలను నమోదు చేసి నివేదిక పంపించామన్నారు.

గొప్ప కవి.. గుర్రం జాషువా

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు



గుర్రం జాషువాకు నివాళి అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తదితరులు

బనగానపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు తన కవితల ద్వారా పోరాడిన గొప్ప కవి గుర్రం జాషువా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యాలయాన్ని ప్రారం భించారు. ఎంపీడీవో కార్యాలయంలో కవి గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పించి, అనంతరం ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుని వలె పోరాడాలన్నారు. గుర్రం జాషువా కవిత్వాలను ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మురళీధర్, రాష్ట్ర నాయకులు బీ.లింగన్న, బిజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్, బండి కిరన్, కసెట్టి చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఉపేంద్రారెడ్డి, చాందిని, సుధాకర్, తప్పెట ప్రసాద్, రవికుమార్, రామసుబ్బయ్య, గుర్రాలు చిన్నయ్య, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: డోన్ పట్టణంలో గుర్రం జాషువ జయంతి ఘనంగా నిర్వహించారు.ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ నాయకులు గుర్రం జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జీవీ రమణారావు, జిల్లా కౌన్సిలర్ పి.మౌలాలి, కిరణ్ ప్రజ్ఞా, మద్దిలేటి, రామదాసు, రామాంజ నేయులు, బీవీ మద్దిలేటి పాల్గొన్నారు.

డోన్ ప్రభుత్వాస్పత్రి వైద్యులపై సీపీఎం నాయకుల ఆగ్రహం

డోన్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం కూడా చేయకుండా కర్నూలుకు వెళ్లాలంటూ చీటీలు రాసి ఇక్కడి వైద్యులు చేతులు దులుపుకుంటున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ధ్వజమెత్తారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. డోన్ జాతీ య రహదారిపై ప్రమాదాలకుల గురైన వారు, ఘర్షణల్లో గాయపడిన వారు డోన్ ప్రభుత్వ వైద్యశాలకు వస్తే వారికి తాత్కాలిక వైద్యం కూడా చేయ కుండా కర్నూలుకు వెళ్లాలని చీటి రాసి చేతులు దులుపుకుంటున్నార న్నారు. అంబులెన్స్ యాజమాన్యాలు దీన్ని ఆసరాగా చేసుకుని రోగుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు చిన్న రెహిమాన్, ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం, అనుబంధ సంఘాల నాయకులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జలదుర్గంలో కొండచిలువ కలకలం



ప్యాపిలి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జలదుర్గం గ్రామంలో ఆదివారం కొండ చిలువ కలకలం రేపించి. పొలాల్లో కొండచిలువ కనపడటంతో రైతులు బెంబేలెత్తారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. డోన్ ఫారెస్టు రేంజ్ అధికారి ప్రవీణ్ సూచన మేరకు సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ వైల్డ్ లైఫ్ సంస్థ సిబ్బంది గ్రామానికి చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం సురక్షితంగా దానిని ఫారెస్టు ప్రాంతంలో వదిలేశారు. ఫారెస్టు అధికారులు మౌళాలి, మహేశ్వరబాయ్, శకుంతల, భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వేద పండితులు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. మహన్యాస రుద్రాభిషేకం, గణపతి హోమం చేశారు. అమ్మవారిని వెండి రథంలో కొలువుదీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి వరప్రసాద్, ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

లారీ యూనియన్ కార్యాలయం ప్రారంభం



లారీ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

చాగలమర్రి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చాగలమ్మ చెంచు కాలనీ వద్ద ఏర్పాటు చేసిన లారీ యూనియన్ కార్యాలయాన్ని ఎస్‌ఐ సురేష్, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా ఆదివారం ప్రారం భించారు. యూని యన్ అధ్యక్షుడు అన్సర్‌బాషా మాట్లాడు తూ లారీ యజమానుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాంస కృత్తుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ అజీముద్దీన్, టీడీపీ నాయకులు కొలిమి మాబుషరీఫ్, మౌళాలి, అనిఫ్, పట్టణ కార్యదర్శి అస్రఫ్, జల్సాగౌస్, నాగూర్ వలి, అబ్దుల్‌ఖాదర్, టైలర్ అమీర్, మాబాష, కరిముల్లా, గఫార్, మహమ్మద్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

'భారత్ బంద్‌ను విజయవంతం చేద్దాం'

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు నిర్వహిస్తున్న భారత్ బంద్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకుడు బీరువాల బాషా పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జేఏసీ కార్యాలయంలో ప్రజా, కుల, హక్కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు మౌలానా అబ్దుల్ రసాది, రజక సంఘం నాయకుడు రమణ, బీసీ సంఘం నాయకుడు వెంకటనరసయ్య, సుబ్బయ్య, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, అధ్యక్షుడు బద్రి వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో పేదలకు మేలు

చాగలమర్రి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎస్టీతో పేద ప్రజలకు ఎంతో మేలని దూదేకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. ఆదివారం ముత్యాలపాడు బస్టాండు సమీంలోని వార్డులో సూపర్-6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి సూపర్-6 సక్సెస్ చేశారని హర్షం ప్రకటించారు. దూదేకుల ఫెడరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కోటకొండలో కూలిన మట్టిమిద్దె

రుద్రవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవిలో కురిసిన భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం చిలకలూరు సమీపంలో నేలవంతెనపై వకుళానది పొంగి ప్రవహించింది. రాకపోకలు నిలిచినట్లు స్థానికులు తెలిపారు. కోటకొండ గ్రామంలో ముత్యాల చెన్నయ్య అనే వ్యక్తికి చెందిన మట్టి మిద్దె కూలింది. ప్రమాదం తృటిలో తప్పింది.

అఖండ పూజలకు ఆహ్వానం

డోన్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేట ఎల్లమాంబేశ్వరి దేవి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా జరిగే అఖండ పూజల్లో పాల్గొనాలని ఆలయ ప్రధాన సేవకుడు ఏఈ నాగరాజు, డోన్ రూరల్ ఎస్‌ఐ మమతను ఆహ్వానించారు. మమతను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకారం

బనగానపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకారం అందిస్తానని మాజీ సర్పం చ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మంగళవారం పేటలో వెలసిన కన్యకాపరమేశ్వరీ వాసవీమాతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టంగుటూరు శ్రీనయ్య, సుధీర్ ఎలక్ట్రానిక్ గోపాల్, అన్వేష్, బచ్చుభాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా జన్మదిన వేడుకలు



పూజలు చేస్తున్న సీఐ మంజునాథరెడ్డి, ఉగ్రసేనారెడ్డి

అవుకు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన సాయినాథుడి ఆలయంలో ఆదివారం షిరిడీ సాయిబాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, సీఐ మంజునాథరెడ్డి పూజలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

దొర్నిపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వ ర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

డోన్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ సర్కిల్‌లో స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ సర్కిల్ ప్రధాన రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.